

కామారెడ్డిలోని డిస్ట్రిబ్యూషన్ సెంటర్ వద్ద పోలింగ్ అధికారులకు సూచనలిస్తున్న అదనపు కలెక్టర్ చంద్రమోహన్

# పోలింగ్‌కు వేళాయె..

- డిస్ట్రిబ్యూషన్ సెంటర్ల వద్ద ఎన్నికల సామగ్రి పంపిణీ
- పోలింగ్ కేంద్రాలకు చేరుకున్న సిబ్బంది
- ఎన్నికల నిర్వహణకు పకడ్బందీ ఏర్పాట్లు: కలెక్టర్



బాన్సువాడలోని డిస్ట్రిబ్యూషన్ సెంటర్ వద్ద సందడి

కామారెడ్డి, మే 12: జహీరాబాద్ లోక్‌సభ స్థానానికి సోమవారం నిర్వహించనున్న పోలింగ్‌కు సర్వం సిద్ధం చేశామని కలెక్టర్ జితేశ్ వీ పాటిల్ తెలిపారు. జిల్లాలోని కామారెడ్డి, ఎల్లారెడ్డి, జుక్కల్ అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలో మొత్తం 6,80,921 మంది ఓటర్లు ఉండగా, 791 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశామని పేర్కొన్నారు. ఇందులో 64 సమస్యాత్మక లొకేషన్లను గుర్తించి 64 మంది మైక్రో అబ్జర్వర్లను నియమించామని వెల్లడించారు. కామారెడ్డి, మద్నూర్, ఎల్లారెడ్డిలో డిస్ట్రిబ్యూషన్ కేంద్రాలను ఏర్పాటు చేశామని తెలిపారు. కామారెడ్డి పరిధిలో 27 రూట్లు, జుక్కల్‌లో 26, ఎల్లారెడ్డిలోని 29 రూట్లలో ప్రత్యేక వాహనాల్లో ఆదివారం ఎన్నికల బృందాలు నిర్దేశించిన పోలింగ్ కేంద్రాలకు తరలివెళ్లాయని అన్నారు. ప్రశాంత వాతావరణంలో ఎన్నికల నిర్వహణకు పకడ్బందీ ఏర్పాట్లు చేశామని, అర్హులందరూ తమ ఓటుహక్కును వినియోగించుకోవాలని సూచించారు. ఎన్నికల సంఘం సూచించిన 12 రకాల గుర్తింపు కార్డుల్లో ఏదో ఒకటి వెంట తెచ్చుకోవాలని, బూత్‌లోకి మొబైల్ ఫోన్లకు అనుమతి లేదని స్పష్టం చేశారు. 516 పోలింగ్ కేంద్రాల్లో వెబ్ కాస్టింగ్ ఏర్పాటు చేశామని తెలిపారు.

**డిస్ట్రిబ్యూషన్‌ను పరిశీలించిన అదనపు కలెక్టర్..**

కామారెడ్డి అసెంబ్లీ సెగ్మెంట్‌కు సంబంధించి డిస్ట్రిబ్యూషన్ సెంటర్‌ను జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో ఏర్పాటు చేశారు. పోలింగ్ సామగ్రి పంపిణీని అదనపు కలెక్టర్ చంద్రమోహన్ పరిశీలించి, సిబ్బందికి పలు సూచనలు చేశారు. చెక్‌లిస్ట్ ప్రకారం సామగ్రిని సరిగా చూసుకోవాలన్నారు. ప్రిసైడింగ్ అధికారి మార్గదర్శకాలను పాటించాలన్నారు. సోమవారం ఉదయం 5.30 గంటలకు రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో మాక్ పోలింగ్ నిర్వహించిన అనంతరం 7 గంటలకు పోలింగ్‌ను ప్రారంభించాలన్నారు. ఈవీఎంలలో సాంకేతిక సమస్య తలెత్తితే వెంటనే రీప్లేస్ చేసేందుకు సెక్టోరల్ అధికారులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఆయన వెంట ఆర్డీవో రంగనాథరావు, మున్సిపల్ కమిషనర్ సుజాత తదితరులు ఉన్నారు.



కామారెడ్డి నుంచి పోలింగ్ సామగ్రితో తరలుతున్న సిబ్బంది



కామారెడ్డి పట్టణంలోని ఆర్ అండ్ బీ భవనంలో ఏర్పాటుచేసిన దివ్యాంగుల పోలింగ్ కేంద్రం

## బాన్సువాడ నియోజకవర్గ పరిధిలో..

బాన్సువాడ, మే 12: బాన్సువాడ నియోజకవర్గంలో మొత్తం 258 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశామని అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారి, బాన్సువాడ ఆర్డీవో రాథోడ్ రమేశ్ తెలిపారు. ఇందుకోసం 26 రూట్లు ఏర్పాటు చేశామని చెప్పారు. 40 సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను గుర్తించి పకడ్బందీ ఏర్పాట్లు చేశామన్నారు. బాన్సువాడ ఎస్‌ఆర్‌ఎన్‌కే ప్రభుత్వ డిగ్రీ కళాశాలలోని డిస్ట్రిబ్యూషన్ కేంద్రాన్ని ఆయన ఆదివారం పర్యవేక్షించారు. మొత్తం 2500 మంది పోలింగ్ సిబ్బంది విధుల్లో పాల్గొంటున్నారని వివరించారు. 5 మోడల్ పోలింగ్ కేంద్రాలు, ఒక దివ్యాంగుల పోలింగ్ స్టేషన్, 5 మహిళా పోలింగ్ కేంద్రాలు, యూత్ కోసం ఒక పోలింగ్ స్టేషన్‌ను ఏర్పాటుచేసినట్లు వివరించారు. ఆయన వెంట తహసీల్దార్లు వరప్రసాద్, శ్రీలత, కళాశాల ప్రిన్సిపాల్ గంగాదర్, డీఏవో సువర్ణ ఉన్నారు.



ఎల్లారెడ్డి నుంచి బస్సుల్లో తరలుతున్న ఎన్నికల సిబ్బంది

## 'ఎల్లారెడ్డి'లో 270 పోలింగ్ కేంద్రాలు

ఎల్లారెడ్డి రూరల్, మే 12: ఎల్లారెడ్డి నియోజకవర్గంలో 2,23,027 మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకోనున్నారు. మొత్తం 270 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటుచేయగా.. 1,080 మంది సిబ్బందిని కేటాయించారు. అన్ని మండలాలను కలిపి 29 రూట్లుగా విభజించారు. ప్రతి రూట్‌కు ఒక రూట్ అధికారి, ఒక సహాయక అధికారిని నియమించారు. 169 పోలింగ్ కేంద్రాల్లో వెబ్ క్యాస్టింగ్ ఏర్పాటుచేశారు. వీరితోపాటు 575 మంది పోలీసులు ఎన్నికల విధులను నిర్వహించనున్నారు. కొంత మంది సిబ్బందిని రిజర్వులో ఉంచారు.

**పోలింగ్ కేంద్రాలకు తరలిన సిబ్బంది, సామగ్రి..**

ఎల్లారెడ్డిలోని జీవదాన్ హైస్కూల్‌లో ఏర్పాటుచేసిన డిస్ట్రిబ్యూషన్ కేంద్రంలో పోలింగ్ సామగ్రిని సిబ్బందికి అందజేశారు. ప్రత్యేక బస్సుల్లో సిబ్బంది ఆదివారం మధ్యాహ్నం సామగ్రితో తరలివెళ్లారు. సిబ్బందికి అవసరమైన ఏర్పాట్లను పోలింగ్ కేంద్రాల వద్ద సమకూరుస్తున్నట్లు అధికారులు తెలిపారు. ప్రతి మండలంలో ఒక మోడల్ పోలింగ్ కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ఎల్లారెడ్డిలో మహిళల కోసం నాలుగు పోలింగ్ కేంద్రాలు, నాగిరెడ్డిపేట మండలంలో ఒక మహిళా పోలింగ్ కేంద్రాన్ని ప్రత్యేకంగా ఏర్పాటుచేశారు.

## జుక్కల్‌లో..

మద్నూర్, మే12: పోలింగ్ కోసం జుక్కల్ నియోజకవర్గంలో అన్ని ఏర్పాట్లు పూర్తిచేశారు. మద్నూర్‌లోని జిల్లా పరిషత్ పాఠశాలలో సిబ్బందికి సామగ్రిని అందజేసి వారికి కేటాయించిన గ్రామాలకు ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన వాహనాల్లో తరలించారు. అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారి శ్రీనివాస్‌రెడ్డి విధులను నిర్వహించే సిబ్బందికి పలు సూచనలు, సలహాలు అందజేశారు. జుక్కల్ నియోజకవర్గంలో మొత్తం 255 పోలింగ్ కేంద్రాల్లో ఉదయం ఏడు నుంచి సాయంత్రం ఆరు గంటల వరకు పోలింగ్ జరుగుతుందని తెలిపారు. అర్హులందరూ ఓటు హక్కును వినియోగించుకోవాలని సూచించారు.



మద్నూర్ డిస్ట్రిబ్యూషన్ సెంటర్ నుంచి..



ఎల్లారెడ్డిలోని డిస్ట్రిబ్యూషన్ సెంటర్ వద్ద పోలింగ్ సామగ్రిని పంపిణీ చేస్తున్న అధికారులు

# విధుల్లో అప్రమత్తంగా ఉండాలి : ఎల్లారెడ్డి డీఎస్పీ

ఎల్లారెడ్డి, మే 12: ఎన్నికల ప్రక్రియ పూర్తయ్యేవరకు ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని ఎల్లారెడ్డి డీఎస్పీ శ్రీనివాసులు అన్నారు. ఎల్లారెడ్డిలోని జీవదాన్ పాఠశాల ప్రాంగణంలో ఏర్పాటు చేసిన రిసెప్షన్ సెంటర్‌లో విధులకు హాజరయ్యే పోలీసులతో ఆయన ఆదివారం మాట్లాడారు. ప్రతి నిమిషం అప్రమత్తంగా ఉంటూ విధులు నిర్వహించాలని, ఎలాంటి ఇబ్బందులు ఎదురైనా వెంటనే ఉన్నతాధికారులకు సమాచారం అందించాలని తెలిపారు. మారుమూల ప్రాంతాల్లో వసతులు లేకున్నా ఎన్నికల సందర్భంగా విధుల్లో జాప్యం ఉండరాదన్నారు. పోలింగ్‌కు తక్కువ సమయం ఉన్నందున గ్రామాల్లో అలజడులు జరుగకుండా గస్తీ తిరగాలని, నలుగురికి మించి ఎక్కడ ఉన్నా వెంటనే చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

**నియోజకవర్గంలో ఒక ఐపీఎస్, ముగ్గురు డీఎస్పీలు..**

ఎల్లారెడ్డి నియోజకవర్గంలోని ఎనిమిది మండలాల పరిధిలో ఎన్నికల విధులను నిర్వహించడానికి ఒక ఐపీఎస్ అధికారిణితోపాటు ముగ్గురు డీఎస్పీలను ఎన్నికల సంఘం ప్రత్యేకంగా నియమించింది. నియోజకవర్గ విస్తీర్ణం ఎక్కువగా ఉండడంతో అధికారుల సంఖ్యను పెంచినట్లు సమాచారం. ఆరుగురు సీఐలు, 24 మంది ఎస్సైలు, 540 మంది పోలీసులు ఎన్నికల విధులను నిర్వహించనున్నారు.



ఎల్లారెడ్డిలో పోలీస్ సిబ్బందికి సూచనలిస్తున్న డీఎస్పీ శ్రీనివాసులు

## పోలింగ్ కేంద్రాలకు చేరుకున్న సిబ్బంది

బీబీపేట్/దోమకొండ/గాంధారి/రామారెడ్డి/పెద్దకొడప్‌గల్, మే 12: బీబీపేట్, దోమకొండ మండలాల్లో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాలకు ఎన్నికల సిబ్బంది ఆదివారం సాయంత్రం చేరుకున్నారు. గాంధారి మండలంలో మొత్తం 39,698 మంది ఓటర్లు ఉండగా.. మొత్తం 46 పోలింగ్ బూత్‌లను ఏర్పాటు చేశారు. ఎన్నికల విధులను నిర్వహించేందుకు సిబ్బంది సామగ్రితో పోలింగ్ కేంద్రాలకు చేరుకున్నారు. రామారెడ్డి మండలంలో లోక్‌సభ ఎన్నికల విధులను నిర్వహించేందుకు పోలింగ్ సామగ్రితో సిబ్బంది ఆదివారం సాయంత్రం వరకు చేరుకున్నారని సెక్టోరియల్ అధికారి సామ హరీశ్‌కుమార్ తెలిపారు. పెద్దకొడప్‌గల్ మండల కేంద్రంలోని పోలింగ్ కేంద్రాన్ని ఎంపీడీవో సూర్యకాంత్ సందర్శించారు. మండలంలో 25 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశామని, మూడు రూట్లలో ముగ్గురు రూట్ ఆఫీసర్లు, ఎన్నికల సిబ్బంది విధులు నిర్వహిస్తారని తెలిపారు.





ఎన్నికల సామగ్రితో రామారెడ్డిలోని పోలింగ్ కేంద్రం వద్ద సిబ్బంది

## వైద్యశాఖలో మరో లైంగిక వేధింపుల ఘటన

### సూపరింటెండెంట్‌పై ఫిర్యాదు చేసిన మహిళా వైద్యులు

రామారెడ్డి, మే 12: మహిళా వైద్యులను వేధిస్తున్న డీఎంహెచ్‌వో ఘటన మరువక ముందే వైద్యశాఖలో పనిచేసే సూపరింటెండెంట్‌పై ఫిర్యాదు వెలుగు చూసింది. డీఎంహెచ్‌వో లక్ష్మణ్‌సింగ్ తీరుపై మహిళా వైద్యులు ఇటీవల నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన వ్యక్తం చేసిన సంగతి తెలిసిందే. తాజాగా జిల్లా వైద్యాధికారి కార్యాలయంలో సూపరింటెండెంట్‌గా విధులు నిర్వహిస్తున్న ఏ.శ్రీనివాస్‌పై మహిళా వైద్యులు కలెక్టర్ జితేశ్ వీ పాటిల్‌కు ఇటీవల ఫిర్యాదు చేశారు. ఫిర్యాదు చేసేందుకు ముందుగా భయపడినా.. వారికి జిల్లా వైద్యులు తోడుగా ఉంటామని భరోసా ఇవ్వడంతో ముందుకు వచ్చినట్లు తెలిసింది. విచారణ చేపట్టి సూపరింటెండెంట్‌పై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని మహిళా వైద్యులు డిమాండ్ చేస్తున్నారు.

***డీఎంహెచ్‌వోపై విచారణకు ఆదేశాలు..***

డీఎంహెచ్‌వో లక్ష్మణ్‌సింగ్‌పై వైద్యశాఖ విచారణకు ఆదేశించింది. విచారణ అధికారిగా డాక్టర్ అమర్‌సింగ్ నాయక్‌ను నియమిస్తూ ఉత్తర్వులను జారీ చేసింది. ఈనెల 15వ తేదీన ఉదయం పది గంటలకు డీఎంహెచ్‌వో కార్యాలయంలో నిర్వహించే విచారణకు జిల్లాలోని పీహెచ్‌సీల్లో పనిచేసే మహిళా వైద్యులు, డీఎంహెచ్‌వో కార్యాలయంలో పనిచేస్తున్న ఇతర అధికారులు తగిన ఆధారాలతో అధికారి ఎదుట హాజరు కావాలని ఆదేశాలు జారీ చేశారు.



కొనుగోలు కేంద్రాన్ని పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ చంద్రమోహన్

## ధాన్యం గొనుగోళ్లను వేగవంతం చేయాలి

భిక్కనూరు, మే12: వర్షాలు కురుస్తున్నందున ధాన్యం కొనుగోళ్లను వేగవంతం చేయాలని అదనపు కలెక్టర్ చంద్రమోహన్ ఆదేశించారు. మండలంలోని తిప్పాపూర్ గ్రామంలోని కొనుగోలు కేంద్రాన్ని జిల్లా పౌర సరఫరాల అధికారి మల్లికార్జున బాబుతో కలిసి ఆదివారం పరిశీలించారు. ధాన్యం తరలించేందుకు వెంటనే రెండు లారీలను సమకూర్చాలని ట్రాన్స్‌పోర్ట్ కాంట్రాక్టర్‌ను ఆదేశించారు. ఆయన వెంట పౌర సరఫరాల ఇన్‌చార్జి మేనేజర్ నిత్యానందం, డీటీ కిష్టయ్య, శ్రీనివాస్, విండో చైర్మన్ వెంకట్‌రెడ్డి, ఎంపీటీసీల ఫోరం మండల అధ్యక్షుడు సాయిరెడ్డి, రాజయ్య పాల్గొన్నారు.

## బాధిత కుటుంబానికి ఆర్థికసాయం

దోమకొండ, మే 12: మండల కేంద్రానికి చెందిన పాత్రికేయుడు విక్రమ్ కుటుంబానికి మాజీ ఎమ్మెల్యే గంప గోవర్ధన్ రూ. పది వేల ఆర్థికసాయం చేశారు. ఈ డబ్బులను స్థానిక బీఆర్‌ఎస్ నాయకులు బాధిత కుటుంబానికి ఆదివారం అందజేశారు. నాయకులు కిషన్‌రెడ్డి, రమేశ్, నాగరాజు, శ్రీనివాస్, రవికుమార్, శేఖర్, రాజిరెడ్డి, నాగరాజురెడ్డి, విజయ్ పాల్గొన్నారు.

### భార్య కాపురానికి రావడంలేదని..

## వాటర్ ట్యాంక్ ఎక్కిన యువకుడు

రామారెడ్డి, మే 12: భార్య కాపురానికి రావడం లేదని ఓ యువకుడు వాటర్ ట్యాంక్ ఎక్కిన ఘటన మండల కేంద్రంలో ఆదివారం చోటుచేసుకున్న ది. ఎస్సై విజయ్ కొండ తెలిపిన ప్రకారం.. భార్య కాపురానికి రావడంలేదని రామారెడ్డికి చెందిన కట్ట బాబు మనస్తాపంతో మద్యం సేవించి రథాల గైని వద్ద ఉన్న వాటర్ ట్యాంక్‌పైకి ఎక్కి ఆత్మహత్యాయత్నం చేశాడు. గమనించిన కానిస్టేబుల్ రంజిత్‌రెడ్డి ట్యాంక్‌పైకి ఎక్కి అగ్నిమాపక సిబ్బంది సహాయంతో బాబును సురక్షితంగా కిందకు దించినట్లు ఎస్సై తెలిపారు. పోలీసులు మురళీమోహన్, వెంకటేశ్ తదితరులు ఉన్నారు.



బాధితుడిని రక్షిస్తున్న పోలీసు

## జాతీయస్థాయి సాఫ్ట్‌బాల్ పోటీలకు ఎంపిక

కామారెడ్డి, మే 12: తెలంగాణ యూనివర్సిటీ పరిధిలో నిర్వహించిన అంతర్ కళాశాలల సాఫ్ట్‌బాల్ పోటీల్లో జిల్లా కేంద్రంలోని డిగ్రీ కళాశాల విద్యార్థులు సత్తాచాటి జాతీయస్థాయికి ఎంపికయ్యారు. రంజిత్ కుమార్, మహ్మద్ హర్షద్, గుగులోత్ సుమన్ నాయక్, బాలాజీ ఉత్తమ ప్రదర్శనతో ప్రథమ స్థానం సాధించారు. వీరు ఈ నెల 15న బెంగళూరులో నిర్వహించే పోటీల్లో పాల్గొంటారని ఇన్‌చార్జి పీడీ డాక్టర్ శ్రీనివాసరావు తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులను ప్రిన్సిపాల్ డాక్టర్ విజయ్‌కుమార్, అధ్యాపకులు అభినందించారు.

## కారు బోల్తా.. ఒకరికి గాయాలు

నిజాంసాగర్, మే 12: నిజాంసాగర్ మండలంలో కారు బోల్తా కొట్టిన ఘటనలో ఒకరికి తీవ్రగాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మెదక్ జిల్లా జహీరాబాద్ ప్రాంతానికి చెందిన ఓ కుటుంబం కారులో ఆదివారం బాసర అమ్మవారిని దర్శించుకొని తిరుగు ప్రయాణమయ్యారు. కొమలంచ గేటు వద్ద నిజాంసాగర్ కెనాల్‌పై ఉన్న గుంతలో కారు టైరు పడడంతో అదుపుతప్పి బోల్తా కొట్టింది. ఈ ఘటనలో ఒకరికి తీవ్ర గాయాలు కావడంతో చికిత్స నిమిత్తం దవాఖానకు తరలించారు.

## గుర్తుతెలియని వాహనం ఢీకొని మహిళ మృతి

రాజంపేట్, మే 12: మండలంలోని ఆర్గొండ గ్రామంలో శనివారం రాత్రి గుర్తు తెలియని వాహనం ఢీకొని కుమ్మరి సత్తెవ్వ (51) మృతిచెందింది. కాలకృత్యాలు తీర్చుకోవడానికి వెళ్తూ రోడ్డు దాటుతుండగా టిప్పర్ ఢీకొట్టి వెళ్లిపోయింది. ఈ ప్రమాదంలో సత్తెవ్వ అక్కడికక్కడే మృతిచెందినట్లు ఎస్సై సంపత్ తెలిపారు.

# జిల్లాలో మోస్తరు వర్షం

కామారెడ్డి/ఎల్లారెడ్డి/ గాంధారి/ మాచారెడ్డి/ దోమకొండ/ బీబీపేట్, మే 12 : జిల్లాలో ఆదివారం ఓ మోస్తరు వర్షం కురిసింది. ఉదయం పొడిగా, ఉక్కపోతగా ఉన్న వాతావరణం మధ్యాహ్నం ఆకాశం మేఘావృతమై ఒక్కసారిగా చల్లబడింది. జిల్లా కేంద్రంలో ఈదురు గాలులు, ఉరుములు, మెరుపులతో గంటపాటు చిరుజల్లులు కురిశాయి.

ఎల్లారెడ్డి పరిసర ప్రాంతాల్లో ఆదివారం భారీ వర్షం కురిసింది. పట్టణంలో ఓ మోస్తరు వర్షం కురువగా పరిసర ప్రాంతాల్లో ఎక్కువగా పడింది. ఎల్లారెడ్డికి ఐదు కిలోమీటర్ల దూరంలో ఉన్న మీసాన్ పల్లి, భిక్కనూరు, శివ్వాపూర్, పెద్దారెడ్డి, మత్తమా ల తదితర గ్రామాల్లో మధ్యాహ్నం మూడు గంటల అనంతరం కురిసిన వర్షంతో వ్యవసాయ భూముల్లో నీరు నిలిచింది. పెద్దగా కురిసిన చినుకులు వర్షాకాలాన్ని తలపించాయని పలు గ్రామాల రైతులు తెలిపారు.



ఎల్లారెడ్డి శివారులోని ఓ పొలంలో నిలిచిన నీరు

గాంధారితోపాటు చుట్టుపక్కల గ్రామాల్లో మధ్యాహ్నం వరకు ఎండ దంచికొట్టగా.. ఒకేసారి ఆకాశం మేఘావృతమై ఈదురు గాలులతో కూడిన వర్షం కురిసింది. సోమారంతండాలో బలమైన గాలులు వీయడంతో కెతావత్ గఫ్పాకు చెందిన నివాసపు షెడ్డు రేకులు ఎగిరిపోయాయి. రేకులు పక్కనే ఉన్న ఎద్దుపై పడడంతో దానికి తీవ్ర గాయాలయ్యాయని బాధితుడు తెలిపాడు.



గజ్యానాయక్‌తండాలో కురుస్తున్న వర్షం

మాచారెడ్డితోపాటు, గజ్యానాయక్ తండా, ఎక్స్‌రోడ్, ఘన్‌పూర్, అక్కాపూర్, పాల్వంచ, భవానీపేట, చుక్కాపూర్ గ్రామాల్లో భారీ వర్షం కురిసింది. దోమకొండ మండలంలో తేలికపాటి వర్షం కురిసింది. కల్లాల్లో ఎండబెట్టిన ధ్యానం తడవకుండా రైతులు టార్పాలిన్లు కప్పారు. బీబీపేట్ మండలంలో ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురిసింది. ఈదురు గాలులకు పలు గ్రామాల్లో విద్యుత్ అంతరాయం ఏర్పడింది.


నమస్తే తెలంగాణ CLASSIFIEDS క్లాసిఫైడ్స్

**CHANGE OF NAME**

★I, **YAMAPURAM RAJESH,** H.No.5-84, Hasakothur, (M) Kammarpally, (D) NZB. changed my Name as **YAMAPURAM RAJESHWAR S/o.YAMAPURAM LINGANNA**

**NTZ-324811**

**CHANGE OF NAME**

★I, **YAMAPURAM LAVANYA,** H.No.5-84, Hasakothur, (M) Kammarpally, (D) NZB. changed my Name as **YAMAPURAM LAXMI W/o.YAMAPURAM RAJESHWAR**

**NTZ-324811**

**RECRUITMENT**

★**Pen, Pencil Company, Educated,** Unemployed Girls/Boys, Male/Female, House Wife Earn 24500-64500 Packing Work at Home 9034548725, 9728230253

**NT-3277**

**గమనిక**

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లైయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్

4 లైన్ల క్లాసిఫైడ్స్ 200/- మాత్రమే.

"పేరు మార్పిడి" ప్రకటన 4 లైన్లకు 250/-

GST వర్తించును

సెల్: 91827 77590